పుత్రవ్యసనం

మువ్వా శ్రీనివాసరావు

అతని జ్ఞాపకాల పుట్ట ఆ ఇల్లు. అతని జీవితానికి పర్యాయపదం ఆ ఇల్లు, తన జీవితాన్నైనా సులభంగా ఖాళీ చేయగలడేమో కానీ ఆ ఇంటిని ఎలా ఖాళీ చేయగలడు అంత సులువుగా?!

కలగా పులగంగా ఆలోచనలు. తను ఆ ఇంటిని ఖాళీ చేయవలసిన సమయం త్వరలోనే ఆసన్నమవబోతుంది. నాగేశ్వరానికి అసలు నిద్రరావడంలేదు. ఎన్నో ఆలోచనలు రేపే తన ప్రయాణం. తిరిగి మరలా ఎప్పుడొస్తాడో? ఏమో! ఈ మధ్యలో తను వు చాలిస్తే ఇక అంతే ఈ ఇంటినీ ఈ ఊరును మళ్ళీ చూడడు.

ఆ ఇంటితో బంధం ఇప్పటిదా?! తను పుట్టింది పెరిగింది ఆ ఇంట్లోనే. తప్పటడుగులు వేసి నడక నేర్చింది ఆ ఇంట్లోనే. చదివింది కొలువు సంపాదించిందీ, మేనమామ కూతురు రత్నంతో సెలవు రోజుల్లో ఆటలాడింది, ఆనందంతో మనసులు మమేకమవ్వగా ప్రేమ పంచుకుందీ ఆ ఇంట్లోనే. పెళ్ళి చేసుకుని స్థిరపడిందీ ఆ ఇంట్లోనే. ఇవన్నీ ఎలా మరచిపోగలడు?! మరచిపోతే అతను మనిషెలా అవుతాడు?? ఆ ఇంట్లోనే కళ్ళు మూసిన దైవ సంభూతులైన అమ్మానాన్న,అర్థాయుష్కురాలైన తన అర్థాంగి... ఆ ఇంటితో ఇంత బంధం అతనిది. మరి ఆ ఇంటిని వదలి ఎలా వెళ్ళగలడు?

గుండెని ఎవరో పిండేస్తున్నట్లుగా ఉంది నాగేశ్వరానికి. సాయంత్రం పెద్దోడు సాంబరాజు తనని కదిపినప్పట్నుంచీ అలానే ఉంది. 'తమ్ముడు శివ ఉత్తరం రాశాడు. వాడు నిన్ను బొంబాయి రమ్మని రాశాడు. ఎప్పుడూ నీ దగ్గరే ఉంటే ఎలా నేను కూడా కొడుకునేకదా. అది నాక్కూడా బాధ్యతే కదా. అదీగాక ఈ మధ్య నాన్నని చూడాలని ఒహటే అనిపిస్తోంది. అందుకే వెంటనే నాన్నను బొంబాయి పంపించేయ్'అంటూ బాధపడుతూ రాశాడు. వాడు అంతగా రాసినప్పుడు వెళ్ళకపోవడం బాగుండదు. ఎలాగైనా నువ్వు బొంబాయి వెళ్ళడమే మంచిది. అందుకనే టికెట్ కూడా రిజర్వేషన్ చేయించేశాను. రేపే నీ ప్రయాణం'.

రెండు ముద్దలు మింగి మాత్రలు వేసుకుని లైట్ ఆర్పేసి మంచం మీద వాలాడనే కానీ అప్పట్నుంచీ అతని మానసిక పరిస్థితి బయట చీకటంత కటికంగానే ఉంది.

ఇంకా కొడుకు కోడలు కూడా పడుకున్నట్లులేరు. వాళ్ళ మాటలు ఇంకా వినబడుతూనే ఉన్నాయి. లోపల్నుంచి పక్కవీధిలో కుక్క ఒకటే మొరుగుతుంది రేపు ఏదో అశుభం జరుగబోతున్నట్లు. లోపల్నుంచి కొడుకు కోడళ్ళ సంభాషణ పూర్తి స్పష్టంగా వినిపిస్తోంది. తను వీళ్ళని విడిచి బొంబాయి వెళ్ళడం కోడలికి ఎంతగానో ఆనందంగా ఉంది. బహుశా తన ఎడబాటు కొన్ని రోజులుగా తన సంరక్షణ గురించి జరుగుతున్న కొడుకు కోడళ్ళ సంవాదానికి ముగింపవుతుందేమో!

* * *

'మనమే ఎందుకు పట్టించుకోవాలి మీ తమ్ముడు మాత్రం కొడుకు కదా? బొంబాయి తీసుకెళ్ళి తన దగ్గర కొన్ని రోజులు ఉంచుకోవచ్చుగదా. అయిన్నా ఈ ముసలాయనకు మాత్రం ఇంగితం లేకపోతే సరి' అంటుంది, పెద్దకోడలు ఆవేశంగా.

దాంతో చలించిపోయి సాంబరాజు తమ్ముడు శివకు వెంటనే ఉత్తరం రాశాడు వచ్చి తండ్రిని అక్కడకు తీసుకెళ్ళమని. అప్పుడు తమ్ముడు తిరుగు సమాధానం రాశాడు 'ఇంత దూరం వచ్చి ఆ ముసలాయన ఎలా ఉండగలడు. అలా వద్దనుకావాలంటే ఆ ముసలాయనకయ్యే ఖర్చులు నేనే భరిస్తాను. అక్కడే ఉంచుకో' అంటూ. ఆ జాబుకు పెద్దకోడలికి కోపం వచ్చేసి 'ఏం మనమేమైనా నౌకర్లమనుకుంటున్నాడా మీ తమ్ముడు,డబ్బులు పంపిస్తాం మీ దగ్గరే ఉంచుకోండంటాడు'' అని మరింత రెచ్చగొడుతుంది. దాంతో సాంబరాజు తమ్ముడికి మరలా వెంటనే ఉత్తరం రాశాడు. 'వెధవ డబ్బుతో ముడి పెట్టకు. నాన్న 'లెక్చరర్' నాతో పాటునీది కూడా. కాబట్టి వెంటనే వచ్చి [illegible] దానికి చిన్నకోడలు అంటుదీ 'ఆ ముసలాయన్ని ఈ మహానగరంలో తెచ్చి పెట్టుకున్న మ్యాసెన్స్ మరకొటుండదు. అంతకీ కాకపోతే ఆయనకోసం ప్రత్యేకంగా ఓ పనిమనిషిని ఎరేంజ్ చేయమనండి' అప్పుడు చిన్నకొడుకు శివ భార్య చెప్పిన మాట ఒక్క అక్షరం పొల్లుపోకుండా తిరిగి తిరుగుజాబు రాశాడు. తిరుగుజాబుతో డబ్బుకూడా అడ్వాన్సుగా పంపిస్తాడు. ఇక చేసేది లేక సాంబరాజు తమ్ముడు తండ్రికోసం పంపించే డబ్బును చూసి తండ్రిని చూసీ చూడనట్లుంటాడు. కానీ పెద్దకోడలు మాత్రం అలా ఘర్షణ పడుతూనే ఉంటుంది. ఆ ఇంట్లో కొన్నాళ్ళపాటుగా నడుస్తున్న చరిత్ర ఇదీ!

సాంబరాజు డిగ్రీ పాసయ్యి 'లా' చదివి ప్రాక్టీసు పెట్టడం వెనుక, శివరావు ఇంజనీరింగ్ చదివి బొంబాయిలో ఓ పెద్ద లిమిటెడ్ కంపెనీలో మేనేజర్ అవ్వడం వెనుక ఇప్పటి ఈ ముసలాయన కృషి పట్టుదల పరపతి అన్నీ మూకుమ్మడిగా ఉన్నాయి.

కానీ పెళ్ళిళ్ళవ్వగానే సాంబ—శివలిద్దరూ వాస్తవం నుంచి అవాస్తవంలోకి వెళ్లి అంధులైపోయారు. అందుకే అప్పుడప్పుడూ అంటుంటారు. 'నువ్వు మాకేం మిగిల్చావు? నువ్వుమాకోసం ఏం చేశావు? మా చదువులు మేమే కష్టబడి పార్టుటైం ఉద్యోగాలు చేసుకుంటూ చదువుకున్నాం' ఇలా భార్యల ముందు అంటూంటే బహుశా వాళ్ళకు మహదానందంగా ఉంటుందేమో! నిజానికి కొడుకులకన్నా కూతుర్లే నయం. ప్రేమ, గౌరవం, కృతజ్ఞతా భావం నిండుగా ఉంటాయి. కూతుర్లు,అల్లుడు ఎప్పుడూ అంటూనే ఉంటారు 'మీరు ఎంచక్కా వచ్చి మా ఇంట్లోనే ఉండిపోవచ్చుగదా' అని. కానీ ఇంత బతుకూ బతికి అల్లుడి దగ్గర ఉండటంలో ఉన్న అవమానం మరకొటుండదని అదీగాక అలావుంటే కొడుకుల్ని లోకం దుమ్మెత్తిపోస్తుందని ఆలోచించి ఛీత్కరించుకున్నా,చీదరించుకున్నా అదే వాకిలిలో పడుండటానికి(?) అలవాటు పడ్డాడు నాగేశ్వరం. అదీగాక ఆ ఇంటితో అతనికున్న సంబంధం కూడా అలాంటిదే. తనకున్న ఒకే ఒక ఇల్లు. తన తండ్రి తనకు వారసత్వంగా మిగిల్చి పోయిన ఇల్లు తన ప్రాణేశ్వరి జీవిత భాగస్వామి బతికినన్నాళ్ళు బతికి చివరకు కళ్ళు మూసిందీ ఆ ఇంట్లోనే. అందుకే తనూ అక్కడే కళ్ళుమూయ్యాలని కోరిక! కానీ ఈ చరమదశలో తనకు ప్రశాంతంగా కళ్ళు మూసే అదృష్టం రాసిపెట్టిలేదేమో! నాగేశ్వరం మనసులో ఓ మూల సన్నగా ఈ మధ్యే ఈ ఆలోచన బయలుదేరింది.

ఉన్నట్లుండి నాగేశ్వరం మంచం మీంచి పైకి లేచాడు. ఆ వేళప్పుడు అతనికెందుకో తన ఫోటో ఆల్బమ్ చూడాలనిపించింది. ఆల్బమ్‌లో షీట్ పక్కకి తిప్పాడు. తను పెళ్ళికి తీయించుకున్న ఫోటో! అప్పుడప్పుడూ సహజంగా భార్య వియోగాన్ని తలచుకుని బాధపడుతుంటాడు నాగేశ్వరం.కానీ ఇప్పుడెందుకో భార్య లేకుండా పోవడమే మంచిదనిపిస్తోంది. ఎందుకంటే కొడుకులు ఇద్దర్నీ పంచుకుని ఇద్దర్నీ దూరం చేసుండేవారేమో! చనిపోయిందన్న తీర్మానానికి వచ్చి వియోగాన్ని అనుభవించడం కన్నా బతికున్నప్పుడే ఎడబాటును అనుభవించడం ఓ భయానక అవస్థ!

పడక్కుర్చీలో వాలి అలా ఆల్బమ్ చూస్తుం[illegible]నావే [illegible]ుంచి నిద్రలోకి జారిపోయాడతను. నాగేశ్వరానికి మెలకువరాలేదు. వరండా ఊడవడానికని వచ్చిన పని మనిషి రావులమ్మ అలా పడక్కుర్చీలో నిద్రబోతున్న నాగేశ్వరాన్ని చూసి ఆశ్చర్యపడి లేపడానికన్నట్లు అతన్ని పిలిచింది.కానీ అతను పలకలేదు. మరలా పిలిచింది. పదే పదే పిలిచింది. కానీ తను ఎంతకూ లేవలేదు. అప్పటికీ పిచ్చుకల రొద.

కంగారుగా రావులమ్మ అతన్ని గట్టిగా కదిపింది. అప్పుడుగానీ అతను కళ్ళు తెరవలేదు. చాలా రాత్రి వరకు లేచి ఉండటంతో నిద్ర గాఢంగా పట్టింది. అప్పుడే నిద్రలేచాడు కాబోలు 'హలో డాళింగ్! కాఫీ' అంటూ అరుస్తున్నాడు పెద్దకొడుకు సాంబరాజు. అతను వెనక్కి తిరిగి ఇంట్లోకి చూశాడు ఎప్పటిలానే కోడలు కనికరించి కాసిని కాఫీ నీళ్ళు పనిమనిషి చేత పంపిస్తుందేమోనని,ఊహు! లేదు.

తను ఈ రోజేగా బొంబాయి వెళ్ళాల్సింది. మరో రెండు గంటల్లో బయలుదేరాలి కాబోలు. రాత్రి విన్న కొడుకు కోడలు సంభాషణ చెవిలో గింగిర్లు తిరుగుతోంది. నాగేశ్వరం మరోసారి వెనక్కి తిరిగి చూశాడు. లాభంలేదు. అలా బయటకు వెళ్ళి హోటల్లో అయినా తాగాలనిపిస్తుంది ఒక్కొక్కప్పుడు. కానీ తన దగ్గరే మాత్రం డబ్బు ఉండటానికి కూడా వీల్లేదు ఆ ఇంట్లో. తన పెద్ద కొడుకు వాడి చిన్న కొడుక్కి చిల్లర ఖర్చులకిచ్చే చిల్లర డబ్బులు కూడా తనకివ్వడు. పైగా తన చిన్నకొడుకు బొంబాయి నుంచి పంపించే డబ్బు కూడా 'ఈ వయస్సులో నీకు ఖర్చులేముంటాయి. మందులు గట్రా మేమే కొనిస్తున్నాం కదా' అంటూ తీసేసుకుంటాడు. ఆ పంపించేవాడు అన్నయ్య అడ్రసుకే పంపిస్తాడు. ఎన్నో సార్లు తన ఉత్తరంలో రాశాడు చిన్నాన్న వాళ్ళ చిరునామాకు పంపించమంటూ కానీ వాడి ధోరణి వాడిదే!

అతనికనిపిస్తుంది అప్పుడప్పుడు జన్మనిచ్చిన పిల్లలకన్నా రావులమ్మ లాంటి పనివాళ్ళే నయమని ఎందుకంటే కోడలు చూడకుండా ఎన్నో సార్లు రావులమ్మ కాఫీ తనకు తెచ్చిచ్చిన సంఘటనలున్నాయి.

రావులమ్మ అతని రెండు జతల మాసిన బట్టల్ని సంచీలో సర్దింది. కళ్ళద్దాలు శుభ్రం చేసి ముఖానికి పెట్టింది. మరీ అరిగిపోయిన పాత చెప్పులు ముందుంచింది. చేతి కర్ర అందించింది. తనకోసం తెచ్చుకున్న పొగాకు కాగితంలో చుట్టి అతనిసంచీలో పెట్టింది. ఇంతలో సాంబరాజు రిక్షా తీసుకుని వచ్చాడు. ''నాన్నా! త్వరగా ట్రెయిన్ టైమ్ అవుతోంది. ఇంతకూ రిజర్వేషన్ టికెట్ భద్రంగా ఉందా? తమ్ముడ్ని అడిగినట్లు చెప్పు'' నాగేశ్వరం రిక్షాలోకూర్చున్నాడు.

రిక్షా కదిలింది. సాంబరాజు అతని భార్య లోనికి వెళ్లిపోయారు. పనిమనిషి రావులమ్మ ఏదో గుర్తుకు వచ్చినదానిలా పరిగెత్తుకుంటూ వెళ్ళి రిక్షా ఆపి ''అయ్యగారూ! మరోలా అనుకోకండి. ఈ డబ్బు మీ దగ్గరుంచండి. అంత దూరం వెళ్తున్నారు చేతిలో కాస్త డబ్బు ఎక్కువగా ఉండాలి'' ఆమె గొంతులో బలీయమైన మానవత్వం

(?)

''ఎందుకే పిచ్చిదానా వద్దు వెళ్ళు,వెళ్ళు'' నాగేశ్వరం నిరాకరించాడు.

రాములమ్మ వెనక్కి వచ్చి ఆ వరండా వైపు అలానే చూస్తూ నిలబడిపోయింది. ఖాళీ పడక్కుర్చీ బోసిపోయిన వరండా!

రాములమ్మకు ఒక్కసారిగా ఏడుపు ముంచెత్తుకొచ్చింది. సాటి మనిషితో మనిషికున్న బంధం అదే. అదే కనుక లేకపోతే ఏముందిక్కడ ఓ ఏడారి ఓ అడవితప్ప!

సాంబరాజు, అతని భార్య నిజానికి అతని పీడా విరగడైందని ఎంతో ఆనందంగా ఉన్నారు. రిక్షా ఆ సందు మలుపు తిరుగుతుండగా ఎదురైంది తన కోడలి తల్లి అంటే తన వియ్యపురాలన్న మాట.'ఇక ఇక్కడే తిష్టవేయడానికి కాబోలు వస్తున్నట్లుంది'అనుకున్నాడు అతను.

* * *



రైల్వే స్టేషన్ జనంతో కిటకిటలాడుతోంది. నాగేశ్వరం మరలా ఓసారి రిజర్వేషన్ టికెట్ వైపు చూసుకున్నాడు. రాత్రి విన్న కొడుకు కోడళ్ళ సంభాషణ ఇంకా చెవిలో గింగుర్లు తిరుగుతూనే ఉంది.

'ఇంతకూ మంచి ప్లానే వేశారు'.

'మరేమనుకున్నావోయ్ సాంబరాజంటే. ఇంటిని లక్ష రూపాయలకు అమ్మేస్తున్నాం. కొత్త ప్లాటు అపార్ట్‌మెంట్స్‌లో రెండు లక్షలకు తీసుకుంటున్నాం. అడ్డెందుకు ఈ ముసలి పీనుగని చెప్పి తమ్ముడు రమ్మన్నాడని ఉత్తరం రాశాడని ఓ చిన్న అబద్ధం ఆడి టిక్కెట్టు కూడా కొనిచ్చి బలవంతానా పంపించేస్తున్నాం'.

'ఇంతకీ నాకనుమానం. ఈ ముసలాయన్ని చూస్తే మీ తమ్ముడు గుండెలు బాదుకుంటాడు ఎందుకొచ్చావంటూ. ఆయనగారి ముద్దుల భార్యకి మరీ కోపం వచ్చి న్యూసెన్స్ నాన్ సెన్స్ అంటూ ఎగిరినా ఎగిరిపడగలదు అయినా ఏం చేస్తారు ఎవరి కోసం చూస్తారు'

రైల్వే స్టేషన్ ప్రయాణీకులతో ఎంతో సందడిగా ఉంది. తను ఎక్కవలసిన ట్రెయిన్ రాబోతున్నట్లు ఎనౌన్స్ మెంట్ విన్నాడు ఒక్కసారి ఏదో నిశ్చయానికి వచ్చిన వాడిలా పైకి లేచాడు నాగేశ్వరం. చేతిలో ఉన్న టికెట్‌ని రెండు ముక్కలుగాచించి గాల్లోకి విసిరేశాడు. సంచీ తీసుకుని వెనుదిరిగాడు.

స్టేషన్ నుంచి బయటకొచ్చాడు. అతని అడుగులు భారంగా పడుతున్నాయి. సిమెంట్ రోడ్డుమీద చేతికర్ర లయగా శబ్దం చేస్తోంది. ఎక్కడికి తన తిరుగుపయనం ఎక్కడికి?!

* * *

'హోమ్ ఫర్ ది ఏజ్డ్'!

నాగేశ్వరం నేరుగా ఆఫీసులోకి వెళ్ళాడు. తనని తాను పరిచయం చేసుకున్నాడు, తన విషాద గాధ గురించికానీ తన శిథిలావస్థపు శేష జీవితం గురించి కానీ ఏమీ చెప్పలేదు. చెప్పుకుంటే ఎక్కడ కొడుకులకు అప్రదిష్ట వస్తుందోనని. చెప్పకపోతేనేం.. ఎటువంటి పరిస్థితిలో అవసరంలో వచ్చి ఇక్కడ చేరతారో వాళ్ళకు తెలుసు. నాగేశ్వరం లాంటి విషాదగాధలు ఇంతకు ముందే విన్నవాళ్ళు గదా వాళ్ళు. 'సాంబ—శివ'ల్లాంటి ఎందరో కొడుకులకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు ఆశ్రయం ఇచ్చిన వాళ్ళు గదా వాళ్ళు. అందుకే వెంటనే ఓ అప్లికేషన్ ఫారం అతని ముందుంచారు. అతను దాన్ని భర్తీ చేశాడు.

పేరు నాగేశ్వరం వయసు అరవై ఆరు తండ్రి పేరు బుచ్చిరామయ్య.

అటెండర్ వచ్చి అతని సంచీ తీసుకుని ''రా పెద్దాయనా! నీ గది చూపిస్తా'' అంటూ తీసుకెళ్ళాడు కాటేజీల వైపు.

''ఇదిగో ఇదే నీ గది. నీవు ఉండాల్సింది ఇక్కడే.'' తాళం తీసి తలుపు తెరిచాడు.

ఎదురుగా తండ్రి బుచ్చిరామయ్య ఫోటో కొడుకును ఆహ్వానిస్తున్నట్లుగా ఉంది. తన,తండ్రి ఆ సంస్థకు అతని పేరు మీదుగా కాటేజీ నిర్మాణానికి డొనేట్ చేశాడు. ఆ కాటేజీలో అతని ఫోటో ఉంచారు.

నాగేశ్వరం తండ్రి ఫోటో వైపు అలానే చూస్తుండిపోయాడు. 'నాన్నా! నా చరమ దశలో కూడా చనిపోయిన నువ్వే నన్ను రక్షించావు. నా సంరక్షణకు పరోక్షంగా ఏర్పాటు చేశావు. ఈ లోకంలో తండ్రి కొడుకును సంరక్షించడమేకానీ కొడుకు తండ్రి సంరక్షణ చూసుకోవడమనేదే లేదు'

అక్కడ వాతావరణం ఎంతో ప్రశాంతంగా చాలా బాగా అనిపిస్తుంది నాగేశ్వరానికి.

ఉన్నకొడుకు లిద్దరికీ తన తండ్రి తనకు మిగిల్చిన ఇంటిని ఇంకా కొద్దో గొప్పో తను సంపాదించిన ఆస్థిని వారసత్వంగా ఇచ్చాడే కానీ ఇలా తన తండ్రి తనను పరోక్షంగా కాపాడినట్లు రేపు ఓ వేళ వాళ్ళకొడుకులు అంటే తన మనవళ్ళు బయటకు వెళ్ళగొడ్తే సంరక్షించటానికి ఏమీ ఏర్పాటు చెయ్యలేకపోయాడే!?! ఇప్పుడే ఆ ఆలోచన నాగేశ్వరంలో చిన్నగా కదులుతోంది. .

అవును ఎంతైనా అయ్యకదా.. నాన్నకదా.. బాపుకదా.. కన్నతండ్రికదా— పాపం పిచ్చితండ్రి నాగేశ్వరం!

●

(నన్ను నన్ను చేసి నన్ను ఓ రచయితను చేసి నాగూర్చి నా కన్నా ఎక్కువగా ఆలోచించి ఆనందించి గర్వించి కనుమరుగైన నాన్న కీ.శే.మువ్వా శివనాగేశ్వరరావుగారికి కన్నీళ్ళతో సమర్పించుకుంటున్న కానుక— రచయిత)